క్లుప్తంగా

నేడు మోడల్ ఐసెట్

మంచాల: మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మోడల్ ఐసెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు సంస్థ సభ్యుడు అశ్వల బాలరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు పరీక్ష ఉంటుందన్నారు. ఫిబ్రవరి 3వ వారంలో ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు. మొదటి బహుమతిగా ట్యాబ్, రెండవ బహుమతిగా స్మార్ట్ ఫోన్, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.5వేల నగదు బహుమతి ఉంటుందని చెప్పారు. గంట ముందుగానే పరీక్ష సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు.

క్రీడా స్ఫూర్తితో మెలగాలి

డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య



క్రీడాకారులతో సత్తయ్య

తుర్కయంజాల్: క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పడుతాయని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం ఆయన యంజాల్ ప్రీమియర్ లీగ్ సీజన్–2 పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తితో టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ స్కూల్ చైర్మన్ పుల్లగుర్రం పురుషోత్తంరెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజర్ ప్రశాంత్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం



కౌన్సిలర్ సునీల్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులోని తొర్రూర్ రాజీవ్ గృహకల్పలో శనివారం కౌన్సిలర్ కాకుమాను సునీల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 34వ బ్లాక్, 35వ బ్లాక్ నుంచి ఔట్‌లెట్ వరకు అంతర్గత డ్రైనేజీ లైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కిషన్, డీనా రావు, భాస్కర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జీజేవై సేవా సమితి ఉపాధ్యక్షుడిగా రాజేందర్



నియామక ప్రతం అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: జీజేవై సేవా సమితి నియోజకవర్గ నూతన కమిటీని అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో శనివారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రాజేందర్, వరుణ్, ప్రధాన కార్యదర్శులుగా నరేశ్, కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్, జీజేవై యువజన విభాగం అధ్యక్షుడిగా నరేశ్‌గౌడ్, ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్, కల్వకుర్తి మండల కమిటీ అధ్యక్షుడిగా శివ, కడ్తాల మండల కమిటీ అధ్యక్షుడిగా రాజును నియమించారు. వీరికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నియామకపత్రాలు అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

మంచాల: ఇటీవల భర్త చనిపోయి నిరాశ్రయులుగా మారిన మహిళకు ఓ జర్నలిస్టు ఆర్థిక సాయం అందజేశాడు. మండల పరిధిలోని చీదేడ్ గ్రామానికి చెందిన మేకల అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు ఆడపిల్లలు సంతానం. అశోక్ మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడ్డింది. శనివారం విషయం తెలుసుకున్న యాచారం మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన జర్నలిస్టు పి.శ్రీను అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశాడు.

అంత్యక్రియలకు..

తలకొండపల్లి: మండల పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన కిష్టమ్మ (57) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందింది. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌గౌడ్, నర్సింహగౌడ్, రమేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని పునఃనిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. శనివారం గ్రామానికి చెందిన బట్టు రాఘవరెడ్డి, శంకరమ్మల జ్ఞాపకార్థం బట్టు కోదండరెడ్డి, లత దంపతులు సర్పంచ్ బట్టు అనురాధకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బట్టు కిషన్‌రెడ్డి, మాధవరెడ్డి, రాంరెడ్డి, విజేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిచేసేవారికే ప్రజల ఆదరణ

ప్రగతి నివేదన సభలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

మంచాల: నిరంతరం ప్రజలకోసం తపించే వారికే ప్రజల ఆదరణ ఉంటుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ ప్రగతి నివేదన పాదయాత్ర శుక్రవారం రాత్రి లోయపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎనిమిదేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు శ్రమించామన్నారు. మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి పనిచేస్తోందన్నారు. గున్‌గల్ నుంచి లోయపల్లి వరకు రూ.32 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 23 కోట్లు ఖర్చు చేశామన్నారు. సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం మరో రూ.15లక్షలు మంజూరు చేశారు. గ్రామంలో నెలకొన్న 43 సర్వే నంబర్‌లోని ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి లోటలేజీ సమస్యను పరిష్కరించామని గుర్తుచేశారు. యువత ఉద్యోగాలు సాధించేందుకు ఎంకేఆర్ ఫౌండేషన్ ప్రత్యేక ఉచిత శిక్షణ అందజేస్తున్నామన్నారు. శిక్షణ పొందిన వారిలో 386మందికి కానిస్టేబుళ్లు,13మంది ఎస్సైలుగా ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించడమేగాకుండా వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారం చేయాలనే మంచి ఆలోచనతో ప్రశాంత్‌కుమార్ రెడ్డి పాదయాత్ర చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ నర్మద, పీఏసీయస్ చైర్మన్ పుల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి బహదూర్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు ఎం.డీ.జానీపాష, నారి యాదయ్య, యువజన విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు జెర్కొని రాజు, మండల అధ్యక్షుడు వనపర్తి భద్రీనాథ్ గుప్తా, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు అంగోత్ ప్రవీణ్ నాయక్, నాయకులు పల్లె జంగారెడ్డి, జానయ్య, అనిరెడ్డి జగన్‌రెడ్డి, నూతన గంటి శేఖర్, పున్నం రాము, చిందం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తుర్కయంజాల్: సీఎంఆర్ఎఫ్ ఆపదలో ఉన్న పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ జ్యోతి, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ కందాల బల్‌దేవ్‌రెడ్డి, పార్టీ వార్డు అధ్యక్షుడు బుద్ధ విజయ్ బాబు, పల్లపు ఆంజనేయులు, గంగని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం తీవ్రతరం చేస్తాం

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: ప్రజలకు హాని కలిగించే బొక్కల కంపెనీని వెంటనే సీజ్ చేయకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఎంపీపీ కొప్పు సుకన్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామస్తులు బొక్కల కంపెనీ మూసేయాలని మూడు రోజులుగా గేటు ఎదుట దీక్ష చేస్తున్నారు. గ్రామస్తులకు మద్దతుగా శనివారం ఆమె దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో మైనింగ్ జోన్, ఫార్మాసిటీ, కాలుష్యంతో కూడిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. యాచారం అభివృద్ధి జరిగింది అనే చెప్పే అధికార పార్టీ నాయకులు గ్రామాలకు వచ్చి ప్రజల ఇబ్బందులు తెలుసుకోవాలన్నారు. బొక్కల కంపెనీని మూసేయాలని అధికారులకు, మంత్రులకు ఏళ్ల నుంచి ఫిర్యాదు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు, కొత్తపల్లి ఉప సర్పంచ్ జగన్, గ్రామస్తులు సంజీవరెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, మల్లేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న ఎంపీపీ సుకన్య తదితరులు

సమస్యలపై రాజీలేని పోరాటం



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కమలాకర్‌రావు తదితరులు

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు

మంచాల: పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు అన్నారు. శనివారం ఆయన రంగాపూర్, పెరికిరాళ్ల తండా, లోయపల్లి, చెన్నారెడ్డిగూడ గ్రామాల్లోని ఉన్నతపాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమలాకర్‌రావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరారు. ఇప్పటికే ఉపాధ్యాయుల సమస్యలను ఎన్నో పరిష్కరించామన్నారు. త్వరలోనే హెల్త్‌కార్డులు ఇప్పిస్తామన్నారు. పీఈటీ, పండిట్ పోస్టులను ఉన్నతీకరణ చేయిస్తామని చెప్పారు. సీపీఎస్ రద్దు చేయించి ఉపాధ్యాయులకు బహుమతిగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, మండల అధ్యక్షుడు రాములు, గౌరవ అధ్యక్షుడు జమీర్, ప్రధాన కార్యదర్శి సీతారాం, మండల బాధ్యులు జావిద్, వెంకటేశ్, శేఖర్, సరూర్ నగర్ మండల గౌరవ అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, బాధ్యులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకు అవకాశమివ్వండి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్



లింగంపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సదానందం గౌడ్ తదితరులు

మంచాల: ఉపాధ్యాయుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకను శాసన మండలికి పంపద్దామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగంపల్లి, మంచాల, ఆరుట్ల, రంగాపూర్, జాపాల, ఆరుట్ల మోడల్ స్కూల్, మంచాల కేజీబీవీ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తి పోరాటం చేసే నాయకుడు, ఎస్టీయూ అభ్యర్థి భుజంగరావుకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరారు. గతంలో గెలుపొంది సమస్యలను పట్టించుకోని నేతలకు గుణపాఠం చెప్పాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పీఈటీ, పండిట్ పోస్టులకు పదోన్నతలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏవీ.సుధాకర్, ఓరిగంటి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాజమల్లేశ్, సుదర్శన్‌రెడ్డి, పాండు, మండల అధ్యక్షుడు గఫార్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, సభ్యులు భాస్కర్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



మాట్లాడుతున్న అనురాధ

జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ

ఆమనగల్లు: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ అన్నారు. మండల పరిధిలోని పోలెపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపీటీసీ సభ్యుడు కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ తరగతులను శనివారం ఆమె ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యుడు కుమార్, కరాటే మాస్టర్ శేఖర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాల్‌రాం, మాజీ సర్పంచ్ సుక్కమ్మ, టీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు జయమ్మ, లాలయ్య, నర్సిరెడ్డి, నవీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీధివ్యాపారులకు రుణాలు ఇప్పించండి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్రవంతి



మాట్లాడుతున్న స్రవంతి

ఇబ్రహీంపట్నం: వీధి వ్యాపారులకు బ్యాంకర్ల నుంచి రుణాలను ఇప్పించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కప్పరి స్రవంతి కోరారు. శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మెప్మా, బిల్ కలెక్టర్లతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వీధి వ్యాపారాలు నిర్వహించే పేదలు అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని వ్యాపారం చేస్తూ ఇబ్బంది పడుతున్నారన్నారు. అటువంటి వారికి తక్కువ వడ్డీకి బ్యాంక్ రుణాలు ఇప్పించాలని మెప్మా సిబ్బందికి సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ మాట్లాడుతూ.. పన్నులు వసూలులో బిల్ కలెక్టర్లు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి ముగిసేలోపు పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేయాలన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: మండల పరిధిలోని ఆరుట్లలో వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు వాజీద్, ఆరుట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు భాషా, ప్రధాన కార్యదర్శి రమేశ్, మండల నాయకులు జంగయ్య, బుగ్గ రాములు, కృష్ణ, సుధాకర్, అశోక్, వెంకటేశ్, శివ, ఎంపీటీసీ సభ్యుడు జయానందం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ పడిపూజ

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్ష్యుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భగ్‌వాన్‌రెడ్డి శనివారం శివ మహాపడి పూజ ఏర్పాటు చేశారు. గురుస్వాములు శంకరయ్య గౌడ్, గోపాల్‌గౌడ్, సత్యనారాయణ నరేశ్ శివ కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా శివనామ స్మరణతో ఆప్రాంతమంతా మార్మోగింది.



శివపూజలో పాల్గొన్న మాలధారణ స్వాములు

వ్యసనాలకు దూరంగా ఉండాలి

తుర్కయంజాల్: ముందుగానే గుర్తిస్తే క్యాన్సర్‌కు చికిత్స అందించవచ్చునని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల భాగస్వామ్యంతో మున్సిపాలిటీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆల్కహాల్‌కు, పొగాకు దూరంగా ఉండడం లాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త



తారమతిపేట ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని తారమతిపేట్ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో రాచకొండ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు తదితర అంశాల పై ఎల్ఈడీ స్కీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామలింగం, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, రాచకొండ కళా బృందం సభ్యుడు అరుణ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు



చెక్కు అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని సలాపూర్ గ్రామానికి చెందిన అనారోగ్యంతో చికిత్స పొందాడు. ఎమ్మెల్యే సహకారంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.60వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కును బాధితుడికి శనివారం జెడ్పీటీసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, సర్పంచ్ యాదయ్య, ఎంపీటీసీ సభ్యురాలు ప్రియ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అన్నారు. శనివారం యూత్ కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నేటికీ అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పాటు నుంచి నేటికీ అమరవీరుల కుటుంబాలను పరామర్శించడం లేదని మండిపడ్డారు. హామీలు అమలు చేసే వరకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ తిరుపతి రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ నర్సింహ, సుధీర్, శివ, నరేశ్, రాజుచారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

ఆమనగల్లు: అసెంబ్లీ ముట్టడి సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకున్న ఎస్ఎస్‌యూఐ నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆమనగల్లు మండలానికి చెందిన ఎస్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం జాతీయ రహదారిపై ఎస్ఎస్‌యూఐ నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా సంఘం సభ్యులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్, ఇతర నాయకులను విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఫరీద్, మహేశ్, సిద్దునాయక్, లక్ష్మణ్, శివ తదితరులున్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



ఫ్రెషర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్ సాంబమూర్తి

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలోని అవంతి విద్యాసంస్థలకు చెందిన ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు సాంబమూర్తి, సుధాకర్‌రెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి మానవతా విలువలతో కూడిన విద్య అవసరమన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ డాక్టర్ అజ్మత్‌హుస్సేన్, డాక్టర్ రామచంద్రారెడ్డిలతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించండి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభులింగం

ఇబ్రహీంపట్నం: పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం సంఘం నాయకుడు పూల యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభులింగం మాట్లాడుతూ.. పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. 55ఏళ్లు నిండిన రైతులకు రూ.5వేల పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, అలీమొద్దీన్, నీలమ్మ, రాజు, విజయ్‌కుమార్, గాలయ్య, లక్ష్మయ్య, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

అసలైన రైతులకు న్యాయం

తహసీల్దార్ సుచరిత



అసైన్డ్ భూముల పరిశీలనలో తహసీల్దార్ సుచరిత

యాచారం: అర్హులైన అసైన్డ్ రైతులకు అన్యాయం జరగనివ్వనని.. సర్టిఫికెట్లు ఉండి, కబ్జాలో ఉన్న రైతుల పేర్లను ధరణి పోర్టల్‌లో నమోదు చేయించి పట్టాదారు పాసుపుస్తకాలు అందేలా కృషి చేస్తానని తహసీల్దార్ సుచరిత అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లోని సర్వే నంబరు 5, 17, 46లలో శనివారం ఆమె పర్యటించా రు. ఎంత మందికి అసైన్డ్ సర్టిఫికెట్లు వచ్చాయి.. సర్టిఫికెట్లలో ఉన్న భూ రికార్డుల ప్రకారం రైతులు కబ్జాలో ఉన్నారా.. నకిలీ సర్టిఫికెట్లున్నాయా అనే వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నకిలీ రికార్డులను తీసేసి బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానన్నారు.